# ఎఫ్ఆర్బీఎం చట్టం నిర్వహణ-సవాళ్లు

**ప్రస్తుతం సంక్షోభంలో ఉన్న ఆర్థిక వ్యవస్థను గట్టెక్కించడానికి కేంద్రప్రభుత్వం ప్రకటించిన ప్రోత్సాహక ప్యాకేజి వల్ల ఎఫ్ఆర్బీఎం చట్ట నిర్వహణ కష్టతరమవుతుందన్న వాదన వినిపిస్తోంది. అయితే సంక్షోభంలో ఉన్న ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టడానికి ఎఫ్ఆర్బీఎం చట్టం అమలును కనీసం రెండు సంవత్సరాల పాటు నిలిపివేయాలని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఈ చట్టం పూర్వాపరాలు...**

సామాజిక రంగానికి సంబంధించి ప్రభుత్వ ప్రాధాన్యాన్ని గుర్తించిన కేంద్రంలోని యూపీఏ ప్రభుత్వం జాతీయ కనీస ఉమ్మడి కార్యక్రమాన్ని (నేషనల్ కామన్ మినిమమ్ ప్రోగ్రాం) ప్రకటించింది. దేశంలో అభివృద్ధి పరమైన లోటును పూరించవలసిన ఆవశ్యకతను ఈ కార్యక్రమం గుర్తించింది. 1996లో యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం కూడా "Common approach to major policy matters and a minimum programme" అనే పేరుతో ఈ విధమైన కనీస ఉమ్మడి కార్యక్రమాన్నే ప్రకటించింది. ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వం నిర్దేశించిన విధాన లక్ష్యాలకనుగుణంగా 9వ ప్రణాళిక (1997-2002) ముసాయిదా పత్రాన్ని రూపొందించారు. 2004లో అధికారంలోకి వచ్చిన యూపీఏ ప్రభుత్వం జాతీయ కనీస ఉమ్మడి కార్య క్రమం ద్వారా జాతికి అనేక వాగ్దానాలు చేసింది. 2000 సంవత్సరం సెప్టెంబర్లో జరిగిన ఐక్యరాజ్యసమితి మిలీనియం సదస్సు లో 188 దేశాల అంగీకారంతో రూపొందించిన మిలీనియం అభివృద్ధి లక్ష్యాలకనుగుణంగా చేపట్టిన అనేక అంశాలను జాతీయ కనీస ఉమ్మడి కార్యక్రమం (ఎన్సీఎంపీ)లో చేర్చారు.

## మిలీనియం అభివృద్ధి లక్ష్యాలు :

తీవ్ర పేదరికం, ఆకలి బాధలను నిర్మూలించాలనే మిలీనియం అభివృద్ధి లక్ష్యంలో భాగంగా.. ఎన్సీఎంపీ ద్వారా ఉపాధి హామీ, వెనుకబడిన ప్రాంతాల్లో ప్రజా పంపిణీ వ్యవస్థ మెరుగుప రచటం, ఆకలితో అలమటిస్తున్న కుటుంబాలకు అంత్యోదయ కార్డులు అందించటం, ఆహారధాన్యాలను బలహీన వర్గాల వారందరికీ లభించేలా చర్యలు, పేద కుటుంబాలకు ఆరోగ్య బీమా అందించే జాతీయ పథకాన్ని ప్రవేశపెడతామని ప్రభు త్వం ప్రకటించింది. అందరికీ ప్రాథమిక విద్యను అందించాలనే లక్ష్యానికనుగుణంగా నాణ్యమైన విద్యను అందించడం, పేదరికం వల్ల విద్యకు ఎవరూ దూరం కాకూడదని ప్రభుత్వం భావిస్తోంది.

మహిళా సాధికారత పెంపు అనే మిలీనియం అభివృద్ధి లక్ష్యానికనుగుణంగా మహిళల్లో రాజకీయ, ఆర్థిక, సాంఘిక సాధికారతకు చర్యలు తీసుకోనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. శిశు మరణాలు తగ్గించాలనే లక్ష్యంతో సంఘటిత శిశు అభివృద్ధి సర్వీసెస్ (ఐసీడీఎస్) అందరికి లభ్యమయ్యే విధంగా చర్యలు.. ప్రసూతి మరణాలు తగ్గించే లక్ష్యంగా జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్ ద్వారా ఆరోగ్య పథకాలను ప్రభుత్వం చేపట్టింది. అడవులపై ఆధారపడిన గిరిజనులు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఆర్థిక వృద్ధి, పర్యావరణ పరిరక్షణ కోసం ప్రభుత్వం ఎన్నో చర్యలు చేపట్టింది. ప్రపంచ అభివృద్ధిలో తన వంతుగా రాజకీయ, ఆర్థిక సంబంధాలను పొరుగున ఉన్న దక్షిణాసియా దేశాలతో మెరుగుపరచుకోవడానికి కృషి చేసింది. అన్ని రకాల అంటు వ్యాధుల నిర్మూలనకు పెట్టుబడులను పెంచింది.

## ఎన్.సి.ఎం.పి.లో బడ్జెట్తో కూడుకున్న ముఖ్యాంశాలు:

- 100 రోజుల ఉపాధి హామీ
- అసంఘటిత రంగానికి మద్దతుగా జాతీయ నిధి ఏర్పాటు
- కొత్త పథకాల ద్వారా 'ఖాదీ, గ్రామీణ పరిశ్రమల కమిషన్'ను పునర్నిర్మించటం
- 2004-2007 మధ్య గ్రామీణ పరపతి రెట్టింపు
- చిన్నతరహా పరిశ్రమలు, స్వయం ఉపాధికి పరపతి సౌకర్యాల విస్తరణ, సర్వీసు రంగంలో అధిక వృద్ధి సాధన
- వ్యవసాయం, గ్రామీణ మౌలిక సౌకర్యాలు, నీటిపారుదల రంగంపై ప్రభుత్వరంగ పెట్టుబడులు పెంపు.
- మెట్ట భూముల సాగుపద్ధతులను ఉపయోగించి మెట్ట, పాక్షిక మెట్ట ప్రాంతాలలో వ్యవసాయాన్ని చేయడం.
- విద్యపై ప్రభుత్వ వ్యయాన్ని జీడీపీలో 6 శాతానికి పెంచటం
- 2009 నాటికి ఆరోగ్య రంగంపై ప్రభుత్వ వ్యయం జీడీపీలో 2 నుంచి 3 శాతానికి చేరే విధంగా చూడటం
- ఆకలితో అలమటిస్తున్న వారికి అంత్యోదయ కార్డులు
- జాతీయ మైనారిటీ అభివృద్ధి కార్పొరేషన్కు నిధులు
- భౌతిక అవస్థాపనలైన రోడ్లు, హైవేస్, పోర్ట్లు, విద్యుచ్ఛక్తి, రైల్వేస్, నీటి సరఫరా, పారిశుద్ధ్య సౌకర్యాల పెంపు
- నగరాలు, పట్టణాల్లో పెద్ద ఎత్తున గృహ వసతి సౌకర్యాలను పెంచడం
- 2008 నాటికి నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయడం
- 2009 నాటికి అన్ని కుటుంబాలకు విద్యుచ్ఛక్తి సౌకర్యాలు
- దేశంలో నదుల అనుసంధానానికి ఉన్న అవకాశాల సమగ్ర పరిశీలన, నగరాల్లో తాగునీటి కొరత నివారించడం
- హైడ్రో కార్బన్ పరిశ్రమలో విదేశీ పెట్టుబడులు పెంచడం

## ద్రవ్య బాధ్యత, బడ్జెట్ యాజమాన్య చట్టం:

అంతర్జాతీయ ద్రవ్య నిధి(ఐఎంఎఫ్), ఇంటర్‌నేషనల్ బ్యాంక్ ఫర్ రీకన్‌స్ట్రక్షన్ అండ్ డెవలప్‌మెంట్(ఐబీఆర్‌డీ) మార్గదర్శకాల కనుగుణంగా విధాన నిర్ణేతలు ఫిస్కల్ గవర్నెన్స్‌లో భాగంగా ద్రవ్య బాధ్యత, బడ్జెట్ యాజమాన్య చట్టం (ఫిస్కల్ రెస్పాన్సిబిలిటీ అండ్ బడ్జెట్ మేనేజ్‌మెంట్ యాక్ట్)ను రూపొందించారు. 2003లో ఐఎంఎఫ్ 'కంట్రీ రిపోర్ట్' భారతదేశాన్ని అధిక ద్రవ్యలోటు కలిగిన దేశంగా వాఖ్యానించింది. అధిక ద్రవ్యలోటు ద్రవ్యోల్బణానికి దారితీసి తద్వారా వినియోగం తగ్గుతుందని ఎఫ్ఆర్ బీఎం చట్టం రూపకర్తల అభిప్రాయం. దీనివల్ల నిరుద్యోగ సమస్య పెరిగి ప్రజల జీవన ప్రమాణ స్థాయి తగ్గుతుంది. ఈ నేపథ్యంలో లోటును తగ్గించుకునే చర్యల్లో భాగంగా 2003లో ఎన్‌డీఏ ప్రభుత్వం ఎఫ్ఆర్‌బీఎం చట్టాన్ని ప్రవేశపెట్టగా 2004లో యూపీఏ ప్రభుత్వం ఈ చట్టాన్ని ఆమోదించింది.

ఐఎంఎఫ్, ఐబీఆర్‌డీ సూచనల్లో భాగంగా కేంద్ర నుంచి రాష్ట్రాలకు బదిలీ అయ్యే వనరుల ప్రక్రియలో రాష్ట్ర ప్రభుత్వాలు విధిగా ఎఫ్ఆర్ బీఎం చట్టాన్ని ఆమోదించాల్సిన ఆవశ్యకతను తెలిపింది. కేంద్ర ప్రభుత్వ ఎఫ్ఆర్‌బీఎం చట్టం మాదిరిగా, కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ముఖ్యంగా కర్ణాటక, కేరళ, తమిళనాడు, పంజాబ్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్రలు 'లోటు నియంత్రణ యంత్రాంగాన్ని' కలిగి ఉన్నాయి. సాధారణంగా మన దేశంలో ఎఫ్ఆర్‌బీఎం చట్టం, ప్రభుత్వాలు సంక్షేమ కార్యక్రమాల నుంచి వైదొలగడానికి ఒక సాధనంగా ఉపకరిస్తుంది. ఎఫ్ఆర్‌బీఎం చట్టం దీర్ఘకాల కోశ లక్ష్యాలతో పాటు వాటి సాధనకు వార్షిక లక్ష్యాలను రూపొందించింది. సీఎంపీలోని లక్ష్యాలను ఎఫ్ఆర్‌బీఎం అమల్లో ఉన్న కాలంలో సాధించలేకపోయాం.

## ఎఫ్ఆర్‌బీఎం కాలంలో ఎన్.సి.ఎం.పి

సమగ్రమైన లోటు తగ్గింపు వ్యూహం ద్వారా ఆర్థిక వ్యవస్థలోని ద్రవ్య అసమతౌల్యాన్ని పూర్తిగా తొలగించగలమని ఎన్‌సీఎంపీ భావించింది. వాస్తవంగా ఎఫ్ఆర్‌బీఎం చట్టాన్ని రూపొందించిన తర్వాత ప్రభుత్వం తన లక్ష్యాల సాధనకు చేసిన ప్రయత్నం సంతృప్తికరంగా ఉంది. ప్రస్తుత కాలంలో జీడీపీ వృద్ధిరేటు, పన్ను-జీడీపీ నిష్పత్తిలో మంచి వృద్ధి సాధించడమే కాకుండా.. ఎఫ్ఆర్‌బీఎం చట్టం లక్ష్యాల సాధనలో భాగంగా అన్ని విధాలైన లోట్లను తగ్గించుకోగలిగింది.

ఎఫ్ఆర్‌బీఎం కాలంలో జీడీపీలో భాగంగా ముఖ్య రంగాలపై చేసే ప్రభుత్వ వ్యయం తగ్గడం కూడా గమనించవచ్చు. కేంద్ర ప్రభుత్వ మొత్తం అభివృద్ధి వ్యయం జీడీపీలో 11 శాతం నుంచి 7 శాతం కన్నా తక్కువకు తగ్గింది. ఇటీవలకాలంలో కేంద్ర ప్రభుత్వం విద్య,ఆరోగ్యం లాంటి రంగాలకు వనరుల కేటాయింపు పెంపుదలకు ప్రయత్నించినప్పటికీ.. ఎన్‌సీఎంపీ అవసరాల కన్నా ఆ కేటాయింపులు తక్కువగా ఉన్నాయి. ఎఫ్ఆర్‌బీఎం కాలంలో రాష్ట్ర ప్రభుత్వాల విత్త సమస్యలు పెరిగాయి. ఈ చట్టం కాలంలో సాంఘిక, ఆర్థిక సేవలకు సంబంధించిన అన్ని రంగాల్లో రాష్ట్ర ప్రభుత్వాల వనరుల పంపిణీ గణనీయంగా తగ్గింది.జీడీపీలో రెవెన్యూ వ్యయం మొత్తం సాంఘిక,ఆర్థిక రంగాలైన విద్య, ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, నీటి సరఫరా, వ్యవసాయం, గ్రామీణాభి వృద్ధి, నీటిపారుదల లాంటి రంగాల్లో తగ్గింది. ఈ చట్టం అమలులో ఉన్న కాలంలో రాష్ట్ర ప్రభుత్వాల మూలధన వ్యయం, కేంద్రం నుంచి రాష్ట్రాలకు వనరుల బదిలీలో తగ్గుదల కన్పించింది.

ఎఫ్ఆర్‌బీఎం రూపకర్తల అభిప్రాయంలో తక్కువ ద్రవ్యలోటు.. స్థరిత ఆర్థిక వృద్ధికి, అధిక ద్రవ్యలోటు.. ద్రవ్యోల్బణానికి దారి తీస్తుంది. అధిక ద్రవ్యలోటు ప్రభుత్వ రుణ పెరుగుదలకు కారణమవుతుంది. మూలధన వ్యయ రూపంలో ద్రవ్యలోటు పెరిగినప్పటికీ.. అది భవిష్యత్తులో డిమాండ్, సప్లయ్ లింకేజ్ ద్వారా అధికవృద్ధికి దారి తీస్తుందనేది ఆర్థిక నిపుణుల అభిప్రాయం. ఒకవైపు ఆర్థిక వ్యవస్థలో వనరులను పూర్తి స్థాయిలో వినియోగించుకోలేకపోవడం, అభిలషణీయ స్థాయి కన్నా ఉత్పత్తి తక్కువ స్థాయిలో ఉండటం వల్ల జీడీపీలో ద్రవ్యలోటును 7-8 శాతం వరకు ఆర్థిక వ్యవస్థ భరించగలదు. అమెరికా, కెనడా లాంటి అభివృద్ధి చెందిన దేశాలు అర్జెంటీనా, పెరూ, బ్రెజిల్ లాంటి మార్కెట్ వ్యవస్థలుకూడా ఇదే విధమైన ద్రవ్య బాధ్యత చట్టాలను కలిగి ఉన్నాయి. ప్రపంచంలో చాలా దేశాలు అభివృద్ధి వ్యయంలో ఎటువంటి రాజీలకు తావివ్వకుండా అధిక ద్రవ్యలోటుతో స్థిరమైన వృద్ధిని కనపరుస్తున్నాయి.

## ఎఫ్ఆర్‌బీఎం చట్టం... ప్రభుత్వ బాధ్యత

ఆర్థిక వ్యవస్థలో ద్రవ్య సరఫరాను పెంచడానికి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ప్యాకేజీ రూ.30,700 కోట్లు. ఇది జీడీపీలో 1 శాతం కంటే తక్కువ. అయితే, ఆర్థిక వృద్ధిని వేగవంతం చేయడానికి ప్రభుత్వం చేయాల్సింది ఇంకా ఎంతో ఉందని ఆర్థికవేత్తలు అభిప్రాయపడుతున్నారు. అభిలషణీయ ద్రవ్య విధానంతో పాటు కోశపరమైన ప్రోత్సాహకాలు అందించి... ఆయా రంగాలు తిరోగమనం వైపు మళ్లకుండా ప్రభుత్వం ప్రయత్నించాలి.

ద్రవ్యోల్బణ పరిస్థితులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటూనే.. ఉపాధి అవకాశాలు మెరుగుపరచడానికి వీలుగా ఆర్థిక వ్యవస్థలో ద్రవ్య సరఫరాను పెంచాలి. ఎఫ్ఆర్ బీఎం చట్టం ప్రకారం... రెవెన్యూ లోటు నిర్మూలించి, ద్రవ్యలోటు తగ్గించడానికి.. కేంద్ర ప్రభుత్వం రుణ సేకరణ ద్వారా ఆర్థిక ప్యాకేజీని ప్రకటించాలి. సరళీకృత వడ్డీరేట్లతో ఈ రుణాన్ని వివిధ రంగాలకు మళ్లించాలి. మౌలిక ఎగుమతుల ప్రాజెక్టుల విషయంలో.. ట్యాక్స్ ఫ్రీ బాండ్లు ప్రవేశపెట్టి... వనరుల సమీకరణకు ఆయా కార్పొరేషన్లకు అనుమతిని వ్వాలి. రాష్ట్ర రుణం-జీఎస్‌డీపీ (రాష్ట్ర స్థూల దేశీయో త్పత్తి) రుణ శాతం నిర్వహణలో... రాష్ట్ర ప్రభుత్వాలు సెక్యూరిటీలు విక్రయించి రుణ సేకరణ చేసే విషయంలో... ఆ రుణం ఏ రంగాలకు మళ్లుతుంది? అనేఅంశంపై కేంద్రం పూర్తిగా సంతృప్తి చెందితేనే అనుమతించాలి. రుణ నిర్వహణ సక్రమంగా జరిగేలా రాష్ట్రాలు, కేంద్ర ప్రభుత్వం చర్య తీసుకోవాలి. తీసుకున్న రుణాన్ని ఉత్పాదక రంగాలపై వ్యయం చేస్తే... భవిష్యత్తులో వృద్ధి రేటు పెరుగుతుంది. తద్వారా వ్యవస్థలో తిరోగమనాన్ని అధిగమించవచ్చు. ఎగుమతుల విషయంలో.. డ్రాబ్యాక్ స్కీంకు సంబంధించి

కేంద్రం స్పష్ట మైన విధానాన్ని ప్రకటించాలి. ఆదాయం పన్ను సెక్షన్ '80 హెచ్‌హెచ్‌సి' కింద ఎగుమతిదారులకు మినహాయింపులను తిరిగి ప్రవేశపెట్టి.. ఎగుమతులను ప్రోత్సహించాలి. జీడీపీలో ఎగుమతుల నిష్పత్తి పెంచడానికి చర్యలు చేపట్టాలి.

### ఎఫ్‌ఆర్‌బీఎం చట్టం – లక్ష్యాలు

- మార్చి 2009 నాటికి రెవెన్యూ లోటు పూర్తిగా తొలగించాలి
- మార్చి 2008 నాటికి ద్రవ్యలోటు, జీడీపీలో 3 శాతానికి సమానంగా ఉండాలి
- 2004–05 మొదలుకొని ప్రతి ఆర్థిక సంవత్సరంలోనూ రెవెన్యూ లోటును జీడీపీలో 0.5 శాతం లేదా అంతకన్నా ఎక్కువ గానీ తగ్గించాలి.
- 2004–05 మొదలు ప్రతి ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యలోటును జీడీపీలో 0.3 శాతం లేదా అంతకన్నా ఎక్కువగా గానీ తగ్గించాలి.